# పత్రి

పద్మనాభాన్ని చూస్తూనే అతను చాలా మంచివాడనుకొన్నాను. అతన్ని నమ్మబుద్దేసింది. ఆఫీసు భారంలో కొంత అతనికి అప్పచెపుదామనికూడా నాకప్పుడే అనిపించింది!

పద్మనాభం వొళ్ళుదాచుకొనేవాడా – అంటే కాదుమరి! ఒక్కోసారి స్టాఫ్ మొత్తం వెళ్ళిపోయినా, అతనలాగే ఫైళ్ళు ముందేసుకొని కూచోడం నేను చూశాను.

కానీ దురదృష్టమేమిటంటే, అతని ఆరోగ్యానికి, ఇక్కడి వాతావరణం బొత్తిగా సరిపడినట్టు కనపడలేదు. ఉన్నట్టుండి విరుచుకుపడిపోయేవాడు. నోటివెంట నురగలొచ్చేవి. మనిషి బిగుసుకుపోయేవాడు.

అతనికి మూర్ఛలున్నసంగతి అప్పటిదాకా నాకు తెలీదు. తెలిసిన డాక్టరు ఇచ్చిన మందులు పనిచేయలేదు. నాలుగైదుసార్లు మా ఇంటికే తీసుకురావలసి వచ్చింది.

"ఏమిటయ్యా ఇదంతా?" అన్నానోసారి!

"మీ నీడన పడిఉందామనుకొన్నానుగానీ, నాకా అదృష్టం లేకపోయింది సార్! నాతో మీ రెంతకాలమని బాధపడతారు? నన్ను తిరిగి వచ్చినచోటుకే పంపించెయ్యండి నా ఖర్మ ఎలాఉంటే అలా అవుతుంది," అని కళ్ళంట నీళ్ళు కూడా పెట్టుకొన్నాడు పద్మనాభం!

విధిలేక మళ్ళీ అతను కోరుకున్నచోటకే బదిలీచేయించి, ఒక మంచిపని చేశానని తృప్తిపడ్డాను.

నెల్లాళ్ళు తిరక్కుండా, ఒకాయనవొచ్చి, "ఇక్కడ పద్మనాభం అనే శాల్త్రీ ఉండాలి. ఎక్కడ?" అన్నాడు.

చెప్పాను.

"ఎదుటివాడికి మూర్ఛలు తెప్పించే వెధవ. వాడికి మూర్ఛలేమిటి? బుట్టలో పడటానికి మీలాంటి అధికారులే ఉండాలి సామీ! లేకుంటే గుమస్తాల బతుకేంగాను?" అన్నాడా పెద్దమనిషి.

ఈసారి మూర్ఛవచ్చింది నాకే!

---

'గోపి'

---